andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8। కనిష్ఠం 25.5

నిర్మల్ జిల్లా వార్తలు

8

బుధవారం 21 ఆగస్టు 2024





రుణమాఫీపై రైతుల ఆందోళన



పొన్కల్‌లో రైతులతో మాట్లాడుతున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ అభిషేక్ (ఫైల్)



- జిల్లాలో మూడు విడతల్లో రూ.592 కోట్ల మాఫీ
- కొన్ని బ్యాంకుల్లో రుణమాఫీ కాలేదని అన్నదాతల ఆవేదన
- అధికారుల చేతివాటంపై అనుమానాలు
- రైతు రుణమాఫీ ఫిర్యాదుల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న వ్యవసాయశాఖ

నిర్మల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రైతు రుణమాఫీ వ్యవహారంలో రైతుల ఆందోళనలు పెరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో తీసుకున్న రుణాలు మాఫీ కాకుండా మళ్లీ చూపుతుండడంతో ప్రభుత్వం తాజాగా అమలు చేస్తున్న రుణమాఫీ తమకు అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటిదాకా మూడు విడతల్లో జిల్లాలో 592 కోట్లు రైతుల రుణాలు మాఫీ చేయగా.. ఇంకా అనేక మంది రైతులు రుణాలు మాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడు విడతల్లో 592 కోట్లు మాఫీ

ఇప్పటిదాకా జిల్లాలో మూడు విడతల్లో 592 కోట్ల రుణాలు మాఫీ చేస్తూ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆయా బ్యాంకులకు ఈ నిధులను జమ చేసింది. మొదటి విడతలో లక్షలోపు రుణం ఉన్న 30,105 మంది రైతులకు సంబంధించి 171 కోట్ల రుణాలను మాఫీ చేశారు. రెండో విడత కింద 19,058 మంది రైతులకు సంబంధించి లక్షన్నర లోపు 200.17 కోట్లు మాఫీ చేశారు. అలాగే మూడో విడత కింద 2 లక్షల లోపు రుణం ఉన్న 15,831 మంది రైతులకు 220 కోట్ల రుణమాఫీ జరిగింది. ఇలా మొత్తం మూడు విడతల్లో ఇప్పటి దాకా 64,994 మంది రైతులకు సంబంధించి 592 కోట్ల రుణ మాఫీ పూర్తి చేశారు.

కొనసాగుతున్న ఆందోళనలు

మూడు విడతలుగా రుణ మాఫీ జరిగినప్పటికీ అనేక గ్రామాల్లో తమకు రైతులు ఇంకా రుణమాఫీ జరగలేదని ఆందోళన చేస్తున్నారు. అధికారుల తప్పిందం కారణంగానే ఇలా జరిగి ఉంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. కొన్ని సహకార సంఘాల్లో జరిగిన అక్రమాల వల్ల రైతులు రుణమాఫీకి దూరం అయ్యారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. తాజా గా లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీ గ్రామం లో రైతులు ఆందోళనకు దిగారు. తమ లోన్లు మాఫీ బ్యాంకు అధికారులు రుణమాఫీకి మీరు అర్హులు కారని చెప్పడంతో ఆందోళనకు గురయ్యామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించిన ప్పటికీ సకాలంలో సీఈవోలు జమ చేయని కారణంతో పాటు తమపై మళ్లీ తీసుకున్న కారణంగా తాజాగా ప్రభుత్వం అమలు చేసిన రైతు రుణమాఫీ జరగలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు అధి కారుల వద్దకు వెళ్లి జరిగిన అన్యాయాన్ని చెప్పడంతో అసలు అక్రమాలు తెరపైకి వస్తున్నాయి. అప్పటి పెయిడ్ సెక్రటరీని పిలిపించాలని రైతులు ఆందోళన చేయగా రెండు మూడు రోజులు వచ్చి విషయం చెబుతానని ఆయన వివరించినట్లు సమాచారం. అలాగే బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్‌లో లోన్లు తీసుకున్న రైతులు రుణం మాఫీ కాక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

23 నుంచి బీజేపీ ఆందోళనలు

జిల్లాలో రైతు రుణమాఫీ వ్యవహారంపై బీజేపీ ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నది. 22న రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆందోళనకు పిలుపునివ్వగా.. 23 నుంచి జిల్లాలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. జిల్లా కేంద్రంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని ఆయన ప్రకటించారు. ఆ తర్వాత జిల్లాలోని ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గంలో బీజేపీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని బీజేపీ వర్గాలు తెలిపాయి.



రహదారిపై ఆందోళన చేస్తున్న రాయపూర్ కాండ్లీ రైతులు

పెంబిలో రైతు రుణమాఫీ ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు



ఫిర్యాదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో

పెంబి రూరల్, ఆగస్టు 20 : రైతు రుణమాఫీ ఫిర్యాదుల కేంద్రాన్ని మంగళవారం రైతువేదికలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈవో రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతీ రైతుకుటుంబానికి రెండు లక్షల రూపాయల చొప్పున పంట రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించి మూడు దఫాలలో రెండు లక్షల రూపాయల లోపల పంటరుణాలు కలిగి ఉన్న కుటుంబాలకు రుణమాఫీ చేపట్టిందన్నారు. సాంకేతిక కారణాల వద్ద రెండు లక్షల రూపాయల లోపల పంట రుణాలు కలిగిన కొంతమంది రైతులకు రుణమాఫీ జరగలేదని అటువంటి వారి కోసం మండల కేంద్రంలో రుణమాఫీ ఫిర్యాదుల నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. భార్యభర్తలు వారి మైనర్ సంతానమును కలిసి ఒక కుటుంబంగా పరిగణిస్తారన్నారు. కావున రెండు లక్షల లోపులోన్ కలిగిన రైతు కుటుంబాలకు ఎవరికైనా రుణమాఫీ జరిగినట్లయితే ఫిర్యాదు కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలి

- వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు రైతుల ఆందోళన



కుభీర్‌లో రుణమాఫీ జరగలేద ఆందోళన చేస్తున్న రైతులు

కుభీర్, ఆగస్టు 20 : మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు, మాలేగాం గ్రామంలో మంగళవారం రైతు రుణమాఫీపై రైతులు ఆందోళన నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యాలయం ముందు బైటాయించి అర్హులైన రైతుల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు కందూర్ కనకయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేశామని గొప్పగా చెప్పుకుంటోందని కాని కేవలం ఒక్క గ్రామంలో ఇరవై శాతం రైతులకు మాత్రమే వర్తించిందని అన్నారు. ఒక్క కుటుంబంలో ముగ్గురు రైతులు ఉంటే బక్కొక్కరికి సుమారు రూ. లక్ష బ్యాంకు రుణం ఉంటే ఆ ముగ్గురికి కలిపి మూడు లక్షల రూపాయలు ఉంటే లక్ష కడితే రెండు లక్షలు మాఫీ చేస్తామని చెప్పడం కరెక్టు కాదని మండి పడ్డారు. రుణమాఫీ విషయంలో మాఫి కాని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులు ఆధార్, పట్టాపాసు పుస్తకాలల్లో తప్పిదాలు ఉంటే వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రత్యేకకౌంటర్లు ఏర్పాటు చేసి మాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆకం నారాయణ, దేవురావునాయక్, రఘునాథ్, పి. గంగాదాస్, ఠాకూర్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్వరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

లోకేశ్వరం : మండల పరిషత్ కార్యాలయం ఎదుట రహదారిపై రాయపూర్ కాండ్లీ గ్రామ రైతులతో పాటు ఆయా గ్రామాల రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... ఒక కుటుంబానికి రెండు లక్షల రూపాయల రుణాన్ని మాఫీ చేస్తామన్న ప్రభుత్వం మాట తప్పి రెండు లక్షల రూపాయల లోపు ఉన్న రైతులకు మాఫీ చేసి చేతులు దులుపుకుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండల తహసీల్దార్ మోతిరాం, మండల వ్యవసాయ అధికారి గణేష్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రమేష్, సునీల్, దేవేందర్, చందు, సుధాకర్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

పెంబి : రైతులకు ఆకాంక్షలు లేకుండా రుణమాఫీని పూర్తి చేయాలని మండల కేంద్రంలో రైతులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మంగళవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి రాగానే ప్రతి రైతు కుటుంబానికి 2 లక్షలు వెంటనే రుణమాఫీ చేస్తామని అధికారంలోకి రాగానే రుణమాఫీ తూతూ మంత్రంగానే రుణమాఫీ చేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతురాజ్యం రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతుకు ఎటువంటి షరతులు లేకుండా వెంటనే 2 లక్షల రుణమాఫీ చేసి వెంటనే అకౌంట్‌లో జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సల్ల నరేందర్‌రెడ్డి, తాజా మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భూక్యా గోవింద్, విలాస్, ఇస్మాయిల్, సరోజ, రమేష్, గాండ్ల శంకర్, బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, రవి, చింతకింది శేఖర్, రైతులు తదితరులు ఉన్నారు.

బాసర బంద్ విజయవంతం



బాసర బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

బాసర, ఆగస్టు, 20: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ బాసర మండల కేంద్రంలో మంగళవారం బంద్ నిర్వహించారు. హిందు సంఘాల పిలుపు మేరకు బాసరలో వ్యాపారసంస్థలు స్వచ్ఛందంగా మూసి ఉంచారు. అమ్మవారి ఆలయం వద్ద గ్రామంలో బస్టాండ్ సమీపాన రైల్వేస్టేషన్, గోదావరి తీరంలో ఇలా అన్ని చోట్ల వివిధ వ్యాపారాలు కొనసాగలేవు. హిందు సంఘాలు స్థానికులు బస్టాండ్ వద్ద గల వివేకానంద విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఒక మతంపై మరొక మతస్థులు దాడులు చేయడం సిగ్గుచేటని పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్నాల సాయినాథ్, బీజేపీ నాయకులు ప్రతాప్‌రావు, పోగుల రాజేశ్వర్, కిశోర్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.



ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్యయత్నం

- బాసర గోదావరి తీరంలో ఘటన
- గమనించి కాపాడిన స్థానికులు, పోలీసులు



పిల్లలు, మహిళతో పోలీసులు

బాసర, ఆగస్టు, 20 : బాసర గోదావరి తీరంలో మంగళవారం ఇద్దరు పిల్లలతో ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ తల్లిని స్థానికులు, పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళ కుటుంబ కలహాల కారణంగా కుమారుడు, కూతురును వెంట బెట్టుకొని బాసరకు వచ్చారు. నదీ తీరాన అనుమానస్పదంగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే వచ్చి విచారించగా చనిపోవడానికి వచ్చినట్లు సమాధానం ఇచ్చారు. దీంతో కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు. పోలీసులు సమయానికి రాకపోయిన, స్థానికులు గమనించకపోయినా పెద్ద ప్రమాదం జరిగి ఉండేది.

వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం

- సీఎస్‌కు వివరించిన కలెక్టర్
- మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 20 : భారీ వర్షాలతో జిల్లాలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా పరిస్థితులపై కలెక్టర్ వివరించారు. ధరణి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. కొత్త రెవెన్యూ చట్టాలపై ఈ నెల 23న వర్క్ షాపులు నిర్వహించి అభిప్రాయం సేకరిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రానున్న ఐదు రోజులు భారీ వర్షాలున్నాయని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాల కారణంగా రహదారులపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర బృందాలు తదితర వాటిపై దిశానిర్దేశం చేశారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెండింగ్ ధరణి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ త్వరితంగా పూర్తికి ఆదేశించారు. కొత్త రెవెన్యూ చట్టాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచిం చారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, సీపీవో బాబురావు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ అధికారులు

చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవాలి

మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 20 : చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి పోషకాహార లోపం గుర్తింపు, నివారణ అనే అంశంపై అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సెక్రటరీ మాట్లాడుతూ... పసిపిల్లల్లో పోషకాహార లోపం గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాల వారీగా పోషకాహార లోపానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోషకాహార లోపం చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన మందులు, పోషకాహారాన్ని అందించాలన్నారు. తల్లిదండ్రులకు పోషకాహార లోపం పట్ల విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ... పోషకాహారలోప నిర్ధారణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల సహాయంతో పోషకాహారలోప గుర్తింపును పూర్తి చేయాలన్నారు. పోషకాహార లోప గుర్తింపు ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల్లో పోషకాహారలోప నివారణకు అధికారులంతా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో రాజేందర్, సీడీపీవో నాగమణి, వైద్య అధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడిన దొంగ పట్టివేత

- రూ.2లక్షల నగదు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం

భైంసా, ఆగస్టు 20 : పట్టణ పరిధిలో వరుస చోరీలకు పాల్పడిన దొంగను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లుగా భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం టౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు తెలిపారు. ఉదయం వేళలో టౌన్ ఎస్ఐ షరీఫ్ పోలీసు సిబ్బందితో కలిసి పాత చెక్‌పోస్టు నాందేడ్ క్రాస్ రోడ్డు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు పట్టుబడినట్లుగా పెర్కొన్నారు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో బోకర్ వైపు నుంచి భైంసా వస్తున్న మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా జల్దారా గ్రామానికి చెందిన దొత్రేరాజు (30) తన బైక్‌ను అపకుండా పారిపోయినట్లుఆ తెలిపారు. దీంతో టౌన్ ఎస్ఐ షరీఫ్ పోలీసు సిబ్బందితో సహ వెంబడించి పారిపోతున్న సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరిలకు పాల్పడిన వివరాలు వెల్లడైనట్లుగా వివరించారు.దీంతో నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద గల రూ.2,01,000 నగదు, పల్సర్ బైక్, సెల్‌ఫోన్‌తో పాటు చోరిలకు వినియోగించే ఇనుప రాడ్, సుత్తి, స్క్రూడ్రైవర్‌ను స్వాధీనపరుచుకున్నట్లుగా తెలిపారు. పట్టణ పరిధిలోని ద్వారకానగర్ దొంగతనం కేసులో రూ.57 వేలు, నేతాజీనగర్‌లో జరిగిన దొంగతనం కేసులో రూ.1.54 లక్షల నగదును జప్తు చేసినట్లుగా వివరంచారు. విలేకరుల సమావేశంలో టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ షరీఫ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

సంక్షిప్త సమాచారం

జిల్లాలో మోస్తారు వర్షం

నిర్మల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 14.1 మిల్లీమీటర్లు కాగా, అత్యధికంగా నిర్మల్‌లో 43.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే సోన్ మండలంలో 37.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, భైంసా మండలంలో 32.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వసామర్థ్యం 7.145 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 4,835 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అధికారులు అప్రమత్తమై రెండు వరద గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరిలోకి 4,835 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

దిలావర్‌పూర్, ఆగస్టు 20 : మండలంలోని సిర్గాపూర్, బన్సపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రైవేట్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. మండలంలో వైరల్ జ్వరాలు, చికున్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు స్పందించి ఉచిత వైద్య శిబిరాలు పెట్టారు. సిర్గాపూర్‌లో జిల్లా కేంద్రంలోని తిరుమల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారు, బన్సపల్లిలో నిజామాబాద్‌లోని మెడికేర్ ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరాలు పెట్టి చికిత్సలు చేశారు. సిర్గాపూర్‌లో డా.రమేష్ రెడ్డి బృందం చికిత్సలు చేయగా, బన్సపల్లిలోని వైద్య శిబిరంలో డా. వాసుదేవన్ బృందం రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఆయా శిబిరాల్లో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాగా వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరాల నిర్వాహకులను పలువురు అభినందిస్తున్నారు.

అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద

వ్యాపారాలకు వేలం పూర్తి

సారంగాపూర్, ఆగస్టు 20 : మండలంలోని అడెల్లి మహాపోచమ్మ దేవాలయం వద్ద వ్యాపార సముదాయాలకు మంగళవారం వేలంపాటను నిర్వహించారు. కొబ్బరి కాయలు విక్రయించడానికి రూ. 17 లక్షల 71 వేలు, ప్యాలాలు, పుట్నాలకు రూ. 1 లక్ష 61 వేలు, క్యాసెట్లు, బొమ్మలు రూ. 6 లక్షల 1 వేయి, టోల్ టాక్స్‌కు రూ. 15 లక్షల 51 వేలు, తైబజార్ రూ. 4 లక్షల 13 వేలు, ఇదుపుల మేకలు సేకరించేందుకు రూ. 60 వేలు ఈ వేలంపాటలో వచ్చినట్లు ఆలయ ఈవో రమేష్ తెలిపారు. ఈ వేలం పాటలో ఆలయ సిబ్బంది, భక్తులు ఉన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

కుభీర్, ఆగస్టు 20 : మండల కేంద్రం కుభీర్‌లోని భట్టి గల్లీ హనుమాన్ ఆలయం నుండి భైంసా బైపాస్ వరకు సిమెంటు రోడ్డు నిర్మించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీవో, తహసీల్దార్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సాప పండరి మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఎమ్ఆర్‌వో కార్యాలయం, మహాలక్ష్మీ ఆలయం, బాలుర వసతి గృహములు, ఉన్నాయని, నిత్యం వందలాది మంది ప్రజలు తమ పనుల కోసం ఇక్కడికి వస్తుంటారని, వర్షం పడితే ఈ రోడ్డు బురదమయం అయి నడవడానికి కూడా వీలు కాకుండా చిత్తడిచిత్తడిగా మారుతుందన్నారు. కావున అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టేల కృషి చేయాలన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 20 : మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివాసంలో రాజీవ్ గాంధీ 80వ జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్‌గాంధీ నేనని అన్నారు. 18ఏళ్లకే యువకులకు ఓటు హక్కును కల్పించారని తెలిపారు. దేశ యువతకి రాజీవ్‌గాంధీ స్ఫూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా జిల్లా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆదేశాల మేరకు డీసీసీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఎంబడి రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి,యువజనకాంగ్రెస్,ఎన్ఎస్ యూఐ నాయకులు,కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివి: జిల్లా అధ్యక్షురాలు దుర్గ భవాని

ఖానాపూర్: భారత దివంగత ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గ భవాని అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఖానాపూర్‌లోని రాజీవ్ చౌక్‌లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత ఆదేశాల మేరకు రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఖానాపూర్‌లో ఘనంగా నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి కాంగ్రెస్ కార్యకర్తలకు మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, నిర్మల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్,నిర్మల్ పట్టణ మహిళా కాం గ్రెస్ అధ్యక్షురాలు వాసవి, బ్లాక్ అధ్యక్షురాలు లక్ష్మీ, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, తదితరులు ఉన్నారు.


ఖానాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు


కల్లూర్‌లో ..

కుంటాల: కుంటాల మండలంలోని కల్లూర్‌లో మంగళవారం ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు నివాళులర్పించారు.భారతదేశానికి దిశానిర్దేశం చేసిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని ముథోల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇంచార్జీ ఆలూర్ ప్రశాంత్ అన్నారు.ఈకార్యక్రమంలో మైనార్టీ నాయ కులు సద్దాం హుస్సేన్,మహేష్,రవి ఉన్నారు.

అనాథ బాలిక దుర్గకు విరాళాల వెల్లువ


దుర్గకు చెక్కును అందజేస్తున్న సమత ఫౌండేషన్ చైర్మన్ సుదర్శన్

తానూర్, ఆగస్టు 20 : తానూర్ గ్రామంలోని బేల్‌తరోడా గ్రామంలో గత మూడు రోజుల క్రితం మేర గంగామణి(36) అనే మహిళ ఆత్మహత్య చేసుకొని చనిపోవడంతో ఆమె కూతురు 11సంవత్సరాల దుర్గ అనాథగా మారింది. ఆమెకు పలువురు దాతలు విరాళాలు అందిస్తున్నారు. సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ రూ. 25వేల చెక్కును మంగళవారం దుర్గకు అందజేశారు. చిన్నారికి విద్య, వైద్యం పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. తానూర్ మండల విద్యుత్ శాఖ కార్యాలయ సిబ్బంది, ఏఈ ప్రదీప్ జాదవ్ రూ.9300లను చిన్నారి దుర్గకు అందజేశారు. పోలీసు హెల్ప్ లైన్ సంస్థ ద్వారా పోలీసు సిబ్బంది రూ.12వేలు అందజేశారు. తరోడా గ్రామానికి చెందిన జనతా గ్యారేజ్ యజమాని ప్రశాంత్ రూ.5వేల నగదును అందజేశారు. తానూర్ మండలంతో పాటు ఆయా మండలాల నాయకులు వారికి తోచినంత చిన్నారి దుర్గకు విరాళాల రూపంలో సహాయం చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈకార్యక్రమంలో సమత ఫౌండేషన్ ఆర్గనైజర్ సాయబ్‌రావు, సీఈవో అనిల్, పీఆర్వో క్రాంతి, బీసీ సంక్షేమ నాయకులు సుంకెట పోశెట్టి, స్థానిక నాయకులు అటల్ దేవిదాస్, మధుపటేల్, లక్ష్మణ్, మౌళఖాన్ సమత ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు సన్మానం

భైంసా రూరల్, ఆగస్టు 20 : గోపాలరావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకులు డాక్టర్ జె. ఓం ప్రకాష్, టీఎస్‌కేసీ మెంటర్ బి. శ్రీనివాసులు ఉత్తమ అధ్యాపకులుగా ఆగస్టు 15న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కాగా వారిని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ కే. బుచ్చయ్య, అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.


ఉత్తమ అధ్యాపకులను శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం



గిరిజన రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న పీహెచ్‌వో

గిరిజన రైతులు కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలి : పీహెచ్‌వో

ఉట్నూర్, ఆగస్టు 20: ఉమ్మడి జిల్లాలోని ఆదిమ గిరిజన రైతులు కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్ గుడిమల్లసందీప్‌కుమార్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ఆధ్వర్యం లో సత్తెనపల్లి రైతు వేదికలో పీవీటీజీ గిరిజనులకు కూరగాయల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాలతో ఆదిమ గిరిజన రైతులకు 12రకాల కూరగాయల విత్తనాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఐటీడీఏ ఉద్యోగులు శ్యామల, చందర్, రైతులు పాల్గొన్నారు.

అర్లి(కె)లో 'శబరిమాత అఖండ జ్యోతి'

తలమడుగు, ఆగస్టు 20: తలమడుగు కలియుగ దేవతగా శబరిమాత అవతరించిందని మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని అర్లి(కె) గ్రామంలో నెల రోజుల పాటు జరిగే శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమం 15వ రోజు సందర్భంగా మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డిచే అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. శబరి మాత కలిగయు దేవతగా అవతరించిందని, తలమడుగు మండలంలో ప్రతి గ్రామంలో శబరిమాత ఆశ్రమాలు ఉన్నాయని, వాటి అభివృద్ధి కొరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తామని, అదేవిధంగా అర్లి(కె) గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. ఇందులో మాజీ ఎంపీటీసీ సి.రమేష్‌రెడ్డి, గ్రామస్థులు ఎల్టి అశోక్‌రెడ్డి, కె.ప్రతాప్, ఎల్.ప్రవీణ్‌రెడ్డి, జి.సాంబశివ, డాక్టర్ మల్లేష్, గజానంద్, సురేందర్ రెడ్డి, రాజు, జనార్ధన్‌రెడ్డి, భూమారెడ్డి, దేవారెడ్డి, మహావీర్, రావుల నారాయణ, ఉత్తం వాగాపూర్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆందోళన రైతులది.. అవస్థ పోలీసులది!!

ఇచ్చోడ, ఆగస్టు, 20: నిత్యం వేలమందిని గమ్యస్థానాలకు చేర్చే ప్రజారథం(ఆర్టీసీ బస్సు) ఒక్కోసారి ప్రజల సహాయం తీసుకుంటుంది. అత్యవసర కాలంలో ఆగిపోయిన ప్రజారథానికి పోలీసు అన్నలు సహాయం అందించారు. మండల కేంద్రంలో మంగళవారం రైతులు రుణమాఫీ కోసం ఆందోళన చేపట్టగా అక్కడ నిలిచిన ఆర్టీసీ బస్సు తిరిగి ప్రారంభమవ్వలేదు. బస్సు బ్యాటరీ, సెల్ఫ్ సమస్య ఉండడంతో అక్కడే ఉన్న పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం బస్సును ముందుకు నేడుతు కనిపించారు. వారి సహాయంతో స్టార్ట్ అయిన బస్సు దాని గమ్యస్థానానికి చెరుకుంది. పోలీసులు బస్సు నేడుతున్న క్రమంలో అక్కడున్న ప్రజలందరూ చూసి హ్యాట్సాప్ పోలీసు అన్నలు అంటూ అభినందించారు.



ఇచ్చోడలో ఆగిపోయిన బస్సును నెట్టుతున్న పోలీసులు

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

● ఆదిలాబాద్ జిల్లాలో నివాళ్లు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 20: దేశంకోసం ప్రాణాలనుత్యాగం చేసిన కుటుంబం గాంధీ కుటుంబమని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మంగళవారం ప్రజాసేవ భవన్‌లో భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లినగేష్, గిమ్మ సంతోష్, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంప్రజాసేవ భవన్‌లో రాజీవగ్‌గాంధీ 80వ జ యంతిని నిర్వహించారు. ఇందులో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ దేశ ప్రధానిగా ఉన్నప్పుడుప్రగతి పథంలో ముందుకు నడిపించారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ కయ్యుం, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూట రాజేశ్వర్, భీమన్న, కోడి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని హస్నాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

ఇంద్రవెల్లి: దేశ ప్రధానిగా దివంగత రాజీవ్‌గాంధీ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి బలహీన వర్గాలకు పెద్దపీట వేసి, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప నాయకుడు రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం కొనియాడారు. రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు సోన్ కాంబ్లే, లక్ష్మీబాయి, పట్టణ అధ్యక్షుడు ఎండి. జహర్, మాజీ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్, పార్టీ నాయకులు

మావల: దేశ సాంకేతిక పరిజ్ఞానానికి నాంది పలికి, అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని ఆయన అందించిన సేవలు మరువలేనివని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ 80వ జయంతిని పురస్కరించుకునరి జిల్లాకేంద్రంలోకి కేఆర్కే కాలనీలోని వృద్ధాశ్రమంలో రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

భోథ్: భారతదేశంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాజీవ్ గాంధీ ఎంతగానో కృషి చేశారని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు పలువురు ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చంటి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు యాదవ్, నాయకులు యూసుఫ్, మహ్మద్ అబ్రాస్, లింబాజీ, యూసుఫ్, సురేందర్, నారాయణ, రహీముద్దీన్, షేక్ షాకీర్, భోజన్న, నట్ల ఉమేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఇంద్రవెల్లి, ఆగస్టు 20: పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి సాయన్న అన్నారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన ముందుగా మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాన్ని సందర్శించారు. బీసీ వసతి గృహానికి తాళం వేసి ఉండటంతో ఎస్సీ వసతి గృహాన్ని, కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలన్నారు.

కొనసాగుతున్న జూడాల ఆందోళన

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 20: కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటనను నిరసిస్తూ జూడాలు ప్రారంభించిన ఆందోళనలు ఏడో రోజుకు చేరాయి. మహిళలపై ఎవరైనా ఆత్యాచార యత్నం వేధింపులకు పాల్పడినట్లయితే స్వీయ రక్షణ ఎలా చేసుకోవాలో వివరిస్తూ మంగళవారం రిమ్స్ అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో జూడాలు అవగాహన కల్పించారు. మహిళల పట్ల మసలుకునే విధానం, మహిళలకు రక్షణ, గౌరవం ఇస్తామని జూడాలు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జూడాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సందీప్ చారి, కారుణ్య, తదితరులు పాల్గొన్నారు.

సంతలో తాగునీటి వసతి

భోథ్, ఆగస్టు 20: మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే సంతలో తాగునీటి వసతి లేక సంతకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ఇటీవల పలువురు మంచినీటి వసతులు కల్పించాలని కోరడంతో పాటు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి రావడం జరిగింది. ఏదీ ఏమైనా తాగునీటి వసతి కల్పించడం పట్ల సంతకు వచ్చేవారు హర్షం వ్యక్తపరుస్తున్నారు. మూత్రశాలలు నిర్మించాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.

రుణమాఫీపై కొనసాగుతున్న నిరసనలు

జైనథ్, ఆగస్టు 20: రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారంగా రూ.రెండు లక్షల రుణమాఫీని వెంటనే చేయాలని మండల రైతు నాయకులు అడ్డి పురుషోత్తం రెడ్డి, తలకొక్కుల రామన్నలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీని భేషరతుగా చేయాలని మంగళవారం మండలంలోని కాప్రీ గ్రామం ఎక్స్ రోడ్డు జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు.

సిరికొండ: రైతులకు రుణమాఫీ కాలేదని అంటే రైతులను అరెస్ట్ చేసి అక్రమ కేసులు బనాయిస్తారా..? అని బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఒరగంటి పెంటన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. మంగళవారం సిరికొండ మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద రుణమాఫీ కానీ రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఇచ్చోడ: రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని రహదారిపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు నిరసన తెలిపారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సీఎం డౌన్ సీఎం డౌన్ అంటూ నినాదించారు.

బోథ్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ ఎటువంటి షంక్షన్ లేకుండా రుణమాఫీ చేయాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బోథ్ బస్టాండ్‌లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులతో పాటు బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీతో కలిసి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు.

గుడిహత్నూర్: రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ మంగళవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు రుణమాఫీ కాని రైతులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మ దహనం చేయబోగా పోలీసులు అడ్డుకున్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ

ఉట్నూర్, ఆగస్టు 20: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలని డీఐఈఓ. రవీందర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని, తరగతులను కళాశాల రికార్డులను తనిఖీ చేసి అడ్మిషన్ల గురించి,తరగతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకు లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ధనరాజ్, డీఐఈవో ఆఫీస్ సూపరింటెండెంట్ మోసిన్, అధ్యాపకులు శ్రీనివాస్, శ్రీలత, గణేష్, వినోద్, తిరుపతి, సుజాత, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వాయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 20: వరదల కారణంగా కేరళలోని వాయనాడ్ అతలా కుతలం అయిందని, వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సిర్రదేవేందర్ అన్నారు. మంగళవారం వాయనాడ్ బాధితుల కోసం విరాళాలను సేకరించారు. నేతాజిచౌక్‌లో దుకాణాలు తిరుగుతు విరాళాలను తీసుకున్నారు. బాధితులకు అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ మాట్లాడుతూ వరదల కారణంగా వాయనాడ్‌లో వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారికి ఆర్థిక సాయం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విరాళాలను సేకరిస్తున్నామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో సంఘం పిలుపు మేరకు విరాళాలను సేకరిస్తున్నామన్నారు. మానవత వాదులు ముందుకు వచ్చి వాయనాడ్ ప్రజలకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాజంగుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

సదల్‌పూర్‌లో నూతన అంగన్‌వాడీ కేంద్ర భవనం ప్రారంభం

జైనథ్, ఆగస్టు 20: బేల మండలంలోని సదల్‌పూర్ గ్రామంలో రూ.9లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనాన్ని సదల్‌పూర్ తాజా మాజీ సర్పంచ్ పెందూర్ రాందాస్ మంగళవారం అంగన్‌వాడీ అధికారులు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని పిల్లల తల్లి దండ్రులు ఐదు సంవత్సరాల లోపు తమ పిల్లలను విధిగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలన్నారు. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామంలోని గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కొడపలక్ష్మి, కరోని గ్రామ అంగన్‌వాడీ టీచర్ మంజుల, గ్రామపెద్దలు శ్యాంరావ్, మాదవ్‌రావ్, కొడప శ్రీజ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 20: ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. జిల్లా కేంద్రంలోని తాటిగూడ కాలనీకి చెందిన ఆడెపు శంకర్ అనే వ్యక్తి ఈనెల 11వ తేదీన ఇంటి నుంచి వెళ్లగా ఆయన ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 12వ తేదీన ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆదిలాబాద్‌లోని రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రాంతంలో స్థానికులు మృతదేహాన్ని గమనించి సమాచారం అందించారు. అయితే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టగా మృతి చెందిన వ్యక్తి ఇటీవల అదృశ్యమైన ఆడెపు శంకర్‌గా గుర్తించారు. దీనికి సంబంధించి ఈ మేరకు కుటుంబీకులకు సమాచారం అందించారు.

ఉపాధి కోసం బహ్రెయిన్ వెళ్లి..

ప్రాణాలు కోల్పోయిన యువకుడు

భైంసా రూరల్, ఆగస్టు 20 : భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామం నుంచి బహ్రెయిన్ దేశానికి ఉపాధి కోసం వలస పోయిన మెండోల్ల సుధాకర్(40) ఆ దేశంలోని తన రూమ్‌లో శవమయ్యాడు. లోలం సబ్‌ఏజెంట్, నిర్మల్‌కు చెందిన ఏజెన్సీ సహాయంతో విజిట్ వీసా మీద బహ్రెయిన్ పంపి ప్రాణాల మీదికి తెచ్చారు. గతంలోనే సదరు లోలం ఏజెంట్ దుబాయ్ పంపగా ఆరు నెలల్లో వాపస్ వచ్చిన సుధాకర్‌ను భీంగల్ ఏజెన్సీ సహాయంతో బహ్రెయిన్ అక్రమంగా పని కోసం విజిట్ వీసా మీద పంపారు. సూపర్‌మార్కెట్‌లో హౌస్‌కీపింగ్ పనికి 12 గంటల పైనే తాత్కాలికంగా పనిచేయగా 6 నెలల్లో మూడు నెలల జీతం మాత్రమే ఇచ్చారు. ఇటీవల ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి బదిలీ చేశారు. రూమ్‌లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆగస్టు 15 గురువారం మరణించాడు. మరణవార్త వెంటనే తెలియకుండా ఉంచిన సదరు యాజమాన్యం రెండు రోజుల అనంతరం కుటుంబానికి తెలుపగా, భైంసా మండల పాక్స్ చైర్మన్ చాకేటి లస్మన్న సహాయంతో ఎంపీటీసీ చాకేటిశోక్ ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల జిల్లా కేంద్రంలో కలిసి వివరాలు తెలుపగా బహ్రెయిన్ దేశం, మానామలో గల రాయబార కార్యాలయానికి అన్ని వివరాలతో కూడిన ఈ మెయిన్‌ను మృతదేహం ఇండియా తెప్పించడం కోసం రాయడమే కాక అక్కడున్న తెలంగాణ నాయకులు పెనుకూల రాజేశ్వర్, గంగారపు అనిల్‌కు సమాచారం అందించారు. అసలే విజిట్ వీసా, ఆపై ఆత్మహత్య చేసుకోవడం వల్ల కుటుంబ సభ్యులు భార్య అనిత ఇద్దరు ఆడపిల్లలు, ఒక కొడుకు రోడ్డున పడ్డారని మాజీ ఎంపీటీసీ అశోక్, బామ్మర్ది బారోళ్ళ శ్రీనివాస్ విచారం వ్యక్తం చేస్తున్నారు. విజిట్ వీసాల మీద విదేశాలకు పంపే హక్కు చట్టరీత్య ఏజెన్సీలకు లేకున్నా, కార్మికులను అక్రమ మార్గంలో పంపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి తక్షణం న్యాయం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

అందుబాటులో రుణమాఫీ సహాయక కేంద్రం

కుంటాల, ఆగస్టు, 20 : మండల కేంద్రం కుంటాల స్థానిక రైతు వేదికలో రుణమాఫీ సహాయక కేంద్రం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని డీఏవో అంజి ప్రసాద్ అన్నారు. రూ. 2 లక్షల పై రుణం ఉన్న రైతులు మాఫీపై ఎలాంటి స్పష్టత రాలేదని, రాష్ట్రంలో 42లక్షల మంది రైతులు ఉండగా 22 లక్షల మంది రైతులకు రుణామాఫీ జరిగిందని మరో 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందన్నారు. ఆధార్ కార్డులో, బ్యాంకు అకౌంట్‌లో పొరపాట్లు ఉన్న రైతులు సహాయ కేంద్రాలను సంప్రదించాలన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చట్ట విరుద్ధం'

కుంటాల, ఆగస్టు, 20: ఎస్సీ వర్గీకరణ చట్ట విరుద్ధమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కుంటాల మండల మండల అధ్యక్షుడు మగ్గిడి దిగంబర్ అన్నారు. మంగళవారం బస్టాండ్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ బద్ధంగా చెల్లదని తెలియజేస్తూ ఎస్సీ వర్గీకరణ ఆపాలని మాల ఎస్సీ ఉపకులాలకు అన్యాయం చేయకూడదని కోరుతూ డీటీకీ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మట్ట దిగంబర్, కార్యదర్శి రాజ్ కుమార్, సభ్యులు గంగాధర్, జగదీశ్, భోజన్న, గంగాధర్, గజేంధర్, సాయికృష్ణ, రాజు, రాకేష్, కార్తీక్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ భవనాన్ని ప్రారంభించాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 20: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ కళాశాల భవనాన్ని వెంటనే ప్రారంభిం చాలనిమంగళవారం కేవీపీఎస్ నాయకులు కలెక్టర్ వెం కటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేవారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు దినకర్, డీవైఎఫ్ఐ నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోఆర్ చట్టంపై ప్రజాభిప్రాయ సేకరణ

ఆసిఫాబాద్, ఆగస్టు 20: ప్రభుత్వం చేపట్టిన నూతన ఆర్‌వోఆర్ చట్టంపై ప్రజాభిప్రాయ సేకరణ ముసాయిదా బిల్లుపై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించ నున్నామని జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 23లోగా ఈ-మెయిల్, పోస్టు ద్వారా సీసీఎల్ఏ కార్యాలయంకు పంపించాలని కోరారు.

రైతు రుణమాఫీలో ప్రభుత్వం విఫలం

● సెప్టెంబరు 1 నుంచి సభ్యత్వ సేకరణ ● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 20 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయడంలో విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... రైతులకు బీజేపీ పూర్తిగా అండగా ఉండి రుణమాఫీ కోసం పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గ్రామాల్లో రుణమాఫీపై ఎండగట్టేందుకు రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజాసమస్యలు తెలుసుకొని గవర్నర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తామన్నారు.



మాట్లాడుతున్న అంజుకుమార్‌రెడ్డి

స్థానిక సమస్యలపై ఐదురోజుల పోరాటాలు చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ కార్యక్రమం సెప్టెంబరు 1 నుండి ప్రారంభించాలన్నారు. సభ్యత్వ సేకరణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూ మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ, దళితమోర్చా అధ్యక్షుడు రాచకొండ సగర్, యువమోర్చా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, నాయకులు ఆకుల కార్తీక్, లింగారెడ్డి, మహేందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాతీయ భావాలతో ముందుకు సాగాలి

● ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్

భైంసా, ఆగస్టు 20 : విద్యార్థులు ప్రణాళికబద్ధమైన విధానాలతో భవిష్యత్తును బంగారుమయం చేసుకొని జాతీయత భావాలతో ముందుకు సాగాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జరిగిన రక్షాబంధన్ కార్యక్రమంలో మాట్లాడారు. ఉన్నత చదువులు చదివి దేశ సేవకు బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలన్నారు. సన్మార్గంలో పయనిస్తూ జీవిత లక్ష్యాలను చేరుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ సాయినాథ్, భైంసా నగర కార్యదర్శి సాయి కిరణ్, బాలికల ప్రతినిధులు స్వాతిక, భవానీ, ధరణీ, పూజ, శృతికల ఆధ్వర్యంలో ఏబీవీపీ శ్రేణులు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్‌కు రాఖీలు కట్టారు.అనంతరం ఏబీవీపీ ప్రతినిధుల ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో రక్షాబంధన్ కార్యక్రమాలు కొనసాగాయి. బాలికలు తమ తమ విద్యా సంస్థల్లోని బాలురకు రాఖీలు కట్టి నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష, మనిద్దరం కలిసి దేశానికి రక్ష అంటూ నినాదాలు చేపట్టారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటం

● సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య ● ఖానాపూర్‌లో పోస్టర్ల విడుదల

ఖానాపూర్, ఆగస్టు 20 : ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు నిరంతర పోరాటాన్ని కొనసాగిస్తామని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ నెల 22న సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అనేక హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయలన్నారు. ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. రైతాంగ రుణాలను పూర్తిగా రద్దు చేసి ఎటువంటి షరతులు లేకుండా అందరికీ కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం చలో హైదరాబాద్ పోస్టులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు అంకుష్‌రావు, జక్కుల రాజన్న, కుంచెపు ఎల్లయ్య, గోరె మియా, వర్మ, మచ్చ శ్రీనివాస్, గోనె లచ్చన్న, మెస్రం ప్రభాకర్, భాస్కర్, దుర్వ రమేష్, కొమరం బాపురావు, నందు, పూసం అనూష, దుర్వ గంగామణి, కోవ కవిత, పూసం వనిత, దుర్వ జల తదితరులున్నారు.



ఖానాపూర్‌లో పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

మహిళా సాధికారత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భైంసా రూరల్, ఆగస్టు 20 : మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం మిషన్‌శక్తి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిషన్‌శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి, మౌనిక మాట్లాడుతూ... మహిళా సాధికారత గురించి, బాల్య వివాహాలు, లింగ వివక్షత, పోక్స్ చట్టాలు, సఖి సర్వీసెస్, చైల్డ్ సర్వీసెస్, ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్స్, సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టులు జ్యోతి, మౌనిక, అంగన్‌వాడీ టీచర్ సునీత, మాజీ ఎంపీపీ కల్పన జాదవ్, మాజీ సర్పంచ్ పెద్ద రాజన్న, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు



కల్లూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో


కుంటాల, ఆగస్టు, 20 : పారిశుధ్య పనుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని డీఎల్‌పీవో సుదర్శన్ పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూర్ గ్రామంలో ఆయన పర్యటించి పంచాయతీ సిబ్బంది పనితీరును పరిశీలించారు. మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీతో పాటు గ్రామంలో పారిశుధ్యం పనులను పరిశీలించారు. మురికికాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ జనవాసాల మధ్య నీరు నిల్వ ఉండకుండా చూడాలని, స్వచ్ఛత, పరిశుభ్రత పాటించాలన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 20 : కేరళ రాష్ట్రం వయునాడ్ వరద బాధితుల సహాయార్థం నిర్మల్ పట్టణం గాంధీ చౌక్‌లో సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం విరాళాలు సేకరించారు. బుధవార్‌పేట్, తదితర ప్రాంతాల్లో సేకరించిన విరాళాలు కేరళ ప్రభుత్వానికి అందజేయనున్నట్లు నాయకులు తెలిపారు. విలాస్, భూక్యా రమేష్, డి. అనంతరావు, పుండలిక్, బలరాం పాల్గొన్నారు.

సదరం శిబిరాలకు హాజరుకండి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 20 : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మీసేవ ద్వారా స్లాట్‌బుక్ చేసుకొని వైటింగ్ జాబితాలో ఉన్న శరీర అంగవైకల్యం, దివ్యాంగులు చరవాణికి సమాచారం వచ్చిన వారు సదరం శిబిరాలకు హాజరు కావాలని డీఆర్డీవో విజయలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ప్రధాన ఆసు పత్రిలో ఈ నెల 23, 27, 30న ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు చేయించుకోవాలన్నారు.







● పట్టణంలో పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్న జ్వర బాధితులు



డెంగ్యూ.. పంజా

- జిల్లాలో రోజురోజుకూ విజృంభిస్తున్న విష జ్వరాలు
- దోమకాటు వ్యాధులతో వణికిపోతున్న పట్టణ వాసులు
- ఇప్పటి వరకు 59 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదు
- పట్టణ ప్రాంతాల్లోనే అత్యధికం
- నియంత్రణకు సిద్ధంగా అర్బన్ డెంగ్యూ యాక్షన్ ప్లాన్
- తీవ్ర జ్వరంతో ఆసుపత్రుల పాలవుతున్న జనం
- జిల్లావ్యాప్తంగా ఎడతెరపిలేని ముసురు వర్షాలతో దోమల వృద్ధి

ఆదిలాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెరిగిపోతున్న డెంగ్యూ పాజిటివ్ కేసులతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దోమకాటు వ్యాధులు విజృంభించడంతో జ్వర బాధితులు చలిజ్వరంతో వణికి పోతున్నారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 59 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదు కావడంతో అధికారులు నియంత్రణ చర్యలు మొదటు పెట్టారు. ఏజెన్సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 37 పాజిటివ్ కేసులు, రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 3, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలకు దోమల ఉధృతి విపరీతంగా పెరిగి పోతుంది. దీంతో దోమకాటుకు గురైన బాధితులు అనారోగ్య భారీన పడుతున్నారు. డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ కావడంతో రిమ్స్ ఆసుపత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరి చికిత్స తీసుకుంటున్నారు. వైద్యం ఆలస్యమైతే ప్లెట్‌లెట్స్ పడిపోయి ప్రమాదకరస్థితిలో పడిపోతున్నారు. ప్లేట్‌లేట్స్ పడిపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. దీంతో వైద్యులు మెరుగైన వైద్యం పేరిట అడ్డగోలుగా దండుకుంటున్నారు. స్థానిక వైద్యంపై భరోసా లేని వారంతా మహారాష్ట్ర, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు. ముఖ్యంగా మధ్య తరగతి, పేద కుటుంబాలు డెంగ్యూ భారీనపడి సతమతమవుతున్నాయి. యేటా డెంగ్యూ భారీన పడి ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నా.. కట్టడి చర్యలు చేపట్టడంలో అధికారుల్లో నిండు నిర్లక్ష్యమే కనిపిస్తోంది. ఇప్పటి వరకు డెంగ్యూ భారీన పడి ఎవరూ మరణించిన దాఖలాలు లేవని అధికారులు చెబుతున్నా.. అనాధికారికంగా డెంగ్యూ భారీన పడి అమాయక జనం ప్రాణాలు పోగట్టుకుంటున్నట్లు తెలుస్తుంది.

అర్బన్‌లో 19 కేసులు

ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 59 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఇందులో పట్టణ ప్రాంతంలో అధికంగా 19 పాజిటివ్ కేసులు నమోదు కావడం ఆందోళన రేపుతోంది. చిల్కూరిలక్ష్మీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2, హమాలీవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 5, పుత్లిబౌలి ఆరోగ్య కేంద్రంలో 3, శాంతినగర్ ఆరోగ్య కేంద్రంలో 2 పాజిటివ్ కేసులు నమోదు కాగా అత్యధికంగా ఖుర్షిద్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 7 పాజిటివ్ కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి లో 37 పాజిటివ్ కేసులు నమోదు కాగా రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కేవలం 3 కేసులు మాత్రమే నమోదైనట్లు తెలుస్తుంది. అయితే ఈ సంఖ్య మరింత అధికంగానే ఉంటుందని తెలుస్తుంది. ఇప్పటివరకు అధికారుల దృష్టికి రాని కేసులు చాలానే ఉంటాయని చెబుతున్నారు. మహారాష్ట్ర, హైదరాబాద్ లాంటి ప్రాంతాలలో వైద్యం చేయించుకుంటున్న వారి వివరాలను అధికారులు నమోదు చేయడం లేదు. పట్టణ ప్రాంతంలో ఖాళీ కొబ్బరిచిప్పలు, కూలర్, పాతటైర్లు, పగిలిన కుండలు, ఇతర పాత్రల్లో వర్షపు నీరు నిలిచి డెంగ్యూ దోమల ఉధృతి పెరిగిపోతున్నా.. నివారణ చర్యలను వేగవంతం చేయడం లేదన్న విమర్శలున్నాయి.

యాక్షన్ ప్లాన్ షురూ..

రోజురోజుకూ డెంగ్యూ పాజిటివ్ కేసులు పెరిగిపోవడంతో అధికారులు నియంత్రణ చర్యలను తీసుకుంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్, మెప్మా సిబ్బందితో కలిపి ప్రత్యేకంగా అర్బన్ డెంగ్యూ యాక్షన్ ప్లాన్‌ను చేపట్టారు. మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో డ్రై డే, యాంటీ లార్వా స్ప్రేయింగ్, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు. అయితే సరిపడా ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో దోమల నియంత్రణ అధికారులకు పెద్ద సవాలుగానే మారింది. పట్టణ ప్రాంతంలోనే పరిస్థితులు ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతంలో మాత్రం పరిస్థితులు మరీ అధ్వానంగా కనిపిస్తున్నాయి. పంచాయతీలకు పాలక వర్గాలు లేకపోవడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. అధికారులు మాత్రం పట్టణ ప్రాంతంపైనే ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అధికారుల తీరు మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాల సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి అధికారులు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి పరిస్థితి ఎదురయ్యేదే కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది డెంగ్యూ వ్యాధి భారీన పడి ఆర్థికంగా నష్టపోవడంతో పాటు ప్రాణాలు కూడా పోగొట్టుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి.

ముందుచూపు ఏదీ?



వానాకాలం సీజన్ ప్రారంభమై మూడు మాసాలు గడిచిపోతున్నా.. దోమల నియంత్రణపై అధికారులకు ముందు చూపు లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. శుక్ర, మంగళవారాల్లో డ్రై డేలుగా నిర్వహించి ఇంటి పరిసర ప్రాంతాలలో నిల్వ ఉంచిన నీటిని డ్రై చేస్తూ ఎడిస్ దోమల వృద్ధిని అరికట్టాల్సిన అవసరం ఉంది. కానీ, అధికారులు నామామాత్రంగానే డ్రైడేను నిర్వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అప్రమత్తంగానే ఉన్నామని వైద్య ఆరోగ్య శాఖాధికారులు చెబుతు న్న జిల్లాలో డెంగ్యూ పాజిటివ్ కేసులు పెరిగిపోవడం ఆందోళన రేపుతోంది. తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారంతా డెంగ్యూ పాజిటివ్ అనే అనుమానంతో ఆసుపత్రుల్లో చేరిపోతున్నారు. దోమల నియంత్రణపై యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టక పోవడంతో దోమకాటు వ్యాధులు విజృంభిస్తునే ఉన్నాయి. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా లాంటి వ్యాధులతో జనం వణికి పోతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోను ఫీవర్ సర్వేను పూర్తి స్థాయిలో చేపట్టినట్లు కనిపించడం లేదంటున్నారు. క్రమం తప్పకుండా బ్లీచింగ్, ఫాగింగ్ చేయడంతో పాటు ఉధృతి అధికంగా ఉన్న ప్రాంతాల్లో దోమ తెరల వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందంటున్నారు.



● జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి ఓపీ వద్ద క్యూ కట్టిన రోగులు

సంక్షిప్త సమాచారం



రుణమాఫీ గ్రీవెన్స్‌కు తరలివచ్చిన రైతులు

భారీగా దరఖాస్తులు

బోథ్, ఆగస్టు 20: రైతు రుణమాఫీ రాని రైతులు భారీ సంఖ్యలో వ్యవసాయ శాఖ కార్యాలయానికి తరలివచ్చారు. మంగళవారం దరఖాస్తులు తీసుకుని దాదాపు 40 మంది వరకు రావడం జరిగింది. అంతకుముందు 30 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో భారీ సంఖ్యలో రైతులు తరలి వస్తుండటంతో సమ్యల పరిష్కారానికి ఏవో విశ్వామిత్ర ఆధ్వర్యంలో దరఖాస్తులు పరిశీలిస్తూ వివరాలు తెలుపుతున్నారు.

విధుల్లో చేరిన బోథ్ ఎస్సై

బోథ్, ఆగస్టు 20: బోథ్ ఎస్ఐ బదిలీ కావడంతో ఆయన స్థానంలో నూతనంగా నిజామాబాద్ నుంచి బదిలీపై వచ్చిన టి.ప్రవీణ్ మంగళవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో శాంతి భద్రతలను పరిరక్షిస్తామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కాగా నూతనంగా ఎస్సై విధుల్లో చేరినట్లు తెలుసుకున్న సోనాలా మాజీ సర్పంచ్ సదానందంతో పాటు పలువురు నాయకులు ఎస్సైని సన్మానించారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి : జిల్లా అధికారి

ఇంద్రవెల్లి, ఆగస్టు 20: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అర్హులైన విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఉపకార వేతనాలు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్‌లో ఉచిత ప్రవేశాలతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివరాజ్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పు వెనక్కి తీసుకోవాలి : దళిత జేఏసీ

నార్నూర్, ఆగస్టు 20: దేశ అత్యున్నతమైన న్యాయస్థానం ఇచ్చిన వర్గీకరణ తీర్పును వెనక్కి తీసుకోవాలని దళిత జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సంతోష్‌మానే డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తడిహత్నూర్ గ్రామం అంబేద్కర్ భవనంలో గ్రామానికి చెందిన దళితసంఘ నాయకులు ప్రజలతో ప్రత్యేక సమావేశం వర్గీకరణ అంశంపై మాట్లాడారు. వర్గీకరణ అంశంపై రేపు భారత్‌బంద్ కార్యక్రమాన్ని అందరూ కలిసి ఐక్యమత్యంగా విజయవంతంగా చేయాలని పిలుపునిచ్చారు. వ్యాపారస్థులు ప్రభుత్వ కార్యాలయాలు జూనియర్ కళాశాల పాఠశాల ఇతరులు స్వచ్ఛందంగా బంద్ ప్రకటించాలని పేర్కొన్నారు. సమావేశంలో మానే విశ్వకళ్యాణ్, దత్తుకాంబ్లె, దయానంద్, సురేష్, రాజబాబు, లింగోరావ్, ఝాడే బాపురావ్, సొంటకే శివాజీ, తదితరులున్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

● రాష్ట్ర రెవెన్యూ సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ● జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు



కలెక్టర్‌తో సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 20: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన ఖమ్మం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులతో భారీ వర్షాలు, దరణి, నూతన రెవెన్యూ చట్టంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని, అందువల్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండడంతో పాటు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని, ముఖ్యంగా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని, ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకు రావాలని ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేకశ్రద్ధ తీసుకుని, స్థానిక పరిస్థితుల ఆధారంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడం లేదా ప్రత్యామ్నయ మార్గాలు చేయాలన్నారు. ప్రస్థత రెవెన్యూ చట్టంలో మార్పులతో తీసుకురానున్న కొత్త రెవెన్యూ చట్టం పై ఈ నెల 23, 24 తేదీలలో జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌నిర్వహించి మేధావులు, సీనియర్ సిటిజన్ల అభిప్రాయాలను తీసుకొని రాష్ట్ర స్థాయికి పంపించాలని కోరారు. అదే విధంగా ధరణి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్లు పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగవంతం చేయాలని, గతంలో ఏవైనా డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయనట్లయితే ఇప్పుడు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఉన్నందున అలాంటి వాటిని గుర్తించి అప్‌లోడ్ చేయించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ రానున్న 5 రోజుల పాటు భారీ వర్షాలు కురిసేందుకు అస్కారం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందులో రాష్ట్ర స్థాయి నుంచిరెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, ఇతర అధికారులు హాజరు కాగా జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ రాజార్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ట్రైని కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, ఆర్డీఓ వినోద్‌కుమార్, జివాకర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలి

ఆదిలాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలన చేసేందుకు నియమించిన రెవెన్యూ, నీటిపారుదల శాఖ, మున్సిపల్ అధికారులతో జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజార్షిషా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో గల 12వేల దరఖాస్తులను 3 నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పరిశీలన కోసం వచ్చే అధికారులకు సహకరించాలని తెలపారు. ఇందులో అదనపు కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, అధికారులు పాల్గొన్నారు.



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

రైతులకు ఆంక్షలు లేకుండా రుణమాఫీ ఇవ్వాలి

● బాధిత రైతులకు ఎమ్మెల్యే పాయల శంకర్ మద్దతు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 20: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం ఆంక్షలు విధిస్తూ మోసగిస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎదుట రైతు బాధితులను కలిసి వారి ఆందోళనకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 1500 మంది రైతులు రుణమాఫీకి అర్హత ఉన్నప్పటికీ కేవలం బ్యాంకు అధికారుల తప్పిదం వల్ల 220 మందికి మాత్రమే రుణమాఫీ జరగడం దారుణమన్నారు. ఫిర్యాదులు స్వీకరించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు కూడా రసీదులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డు ఉన్న వాళ్లకి రుణమాఫీ చేయడం శోచనీయమన్నారు. కొందరికీ రూ.50 వేలు మరికొందరికి రూ.లక్షా 50 వేలు, మరి కొందరికి రూ.2 లక్షల రుణమాఫీ జరగకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ అధికారుల చుట్టూ తిరుగుతూ ఆందోళన చెందుతున్నారని అన్నారు. అనంతరం బ్యాంక్ సిబ్బందిని వివరాలు అడిగి రుణమాఫీపై ప్రకటన జారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు సంతోష్, దయాకర్, ఆకుల ప్రవీణ్, రాందాస్, ముకుంద్, దత్తు, నరేష్, అనిల్, ఆదినాథ్, సుభాష్, రాజు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

● రైతులపై వెంటనే కేసులు ఎత్తి వేయాలి

ఆదిలాబాద్ అర్బన్: రుణమాఫీ విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా రైతులు నిరసనలు తెలుపుతున్నారని, కానీ వారిపై ప్రభుత్వం కేసులు పెట్టడం సరికాదని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మంగళవారం అఖిల పక్షం రైతు సంఘం ఆధ్వర్యంలో మున్నూరుకాపు సంఘ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయా రైతు, పార్టీల నాయకులు పాల్గొని వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతులపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందులో బండి దత్తాత్రి, గోవర్ధన్, లోకారి పోశెట్టి, ఆయా పార్టీలు, సంఘాల నాయకులు దర్శనాల మల్లేష్, కిరణ్, జగన్, వెంకటనారాయణ, సచిన్, తదితరులున్నారు.

డెంగ్యూ నివారణ పట్టణ ప్రణాళిక అమలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 20: పట్టణంలో రోజురోజుకూ పెరిగిపోతున్న డెంగ్యూ కేసులను నియంత్రించడానికి కలెక్టర్ రాజర్షిషా ఆదేశానుసారం మంగళవారం నుంచి డెంగ్యూ నివారణ పట్టణ ప్రణాళిక అమలును ప్రారంభించారు. ఇందులో భాగంగా డీఎంహెచ్‌వో కె.కృష్ణ, డీఎంవో శ్రీధర్ మెప్మా, పురపాలక, ప్రజారోగ్య సిబ్బందితో కలిసి పట్టణంలోని 11వ వార్డులో పారిశుధ్యం తీరును పరిశీలించారు. డెంగ్యూ నివారణ కోసం పైరిత్రిన్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తూ పారిశుధ్యం పట్ల కాలనీవాసులకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వారు సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : జీసీడీవో

నేరడిగొండ, ఆగస్టు 20: సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీసీడీవో మేస్రం చాయ అన్నారు. మంగళవారం మండలంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలు కుంటాల, దిశా మోడల్ స్కూల్, లక్కంపూర్‌లను జీసీడీవో మేస్రం చాయ సందర్శించారు. ఈ సందర్భంగా తరగతులను పరిశీలించారు. కష్టపడి చదవాలని, వర్షాకాలపు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో, వంటగది పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సిక్ రూము శుభ్రంగా ఉంచాలని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఏఎన్‌ఎంలకు సూచించారు. ఉపాధ్యాయుల రోజువారి డైరీలను పరిశీలించారు. వెంట హెచ్‌ఎం గుగ్లోత్ అంబరావు, అశోక్‌రావు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

30 పడకల ఆసుపత్రిలో వైద్యులుగా జితేందర్‌రెడ్డి, నరేందర్ రాథోడ్

నార్నూర్, ఆగస్టు 20: మండలకేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిని గత వారం కలెక్టర్ రాజర్షిషా ఆకస్మిక తనిఖీ సందర్భంగా డాక్టర్ల ఇతర సిబ్బంది కొరత ఉంది స్థానికులు విన్నవించారు. ఈ ప్రాంతవాసులు ప్రత్యేకంగా ఆసుపత్రిలో కలిసి విన్నవించడంపై స్పందించిన వెంటనే జిల్లా వైద్యశాఖ అధికారి ఇద్దరు వైద్యులను అపాయింట్ చేయాలని ఆదేశించారు. వెంటనే స్పందించిన వైద్యశాఖ సమస్యకు పరిష్కారం చేయడం జరిగింది. దీంతో నార్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీపై కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి వైద్యుడు జితేందర్‌రెడ్డి, అలాగే దంతన్‌పల్లి పీహెచ్‌సీ వైద్యుడు నరేందర్ రాథోడ్‌ను ఇక్కడికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మంగళవారం వారు బాధ్యతలు సైతం స్వీకరించారు.

అయితే, గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక సమస్యలు ఉన్నాయి. గ్రామస్థులు చాలాసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు తెలిపారు. కాగా, గతవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'ఆసుపత్రి వద్ద రోగులకు కరువైన రక్షణ' అనే కథనంపై కలెక్టర్ స్పందించి ఇక్కడికి వచ్చి సమస్యలు ఆరా తీశారని, సమస్యలు పరిష్కారం చేస్తానని ఇచ్చిన మాట నెరవేర్చడంపై కలెక్టర్ పని తీరును గ్రామస్థులు అభినందించారు.